పూటే కూర్చుంటారు: ముషాయిరాలనే సామూహిక గజల్ కార్యక్రమాల్లో అయితే, లఘు భోజనంచేసి స్త్రీ పురుషులు యథాశక్తి లలిత వస్త్రభూషలతో అలంకరించుకుని శరీరాన్ని కోమల సుగంధ స్పర్శతో మేళవించుకుని హృదయాన్ని కళాత్మక తంత్రులతో అనుసంధించి-సమావేశం అవుతారు. అలాంటి కవిత్వ సమావేశాల్లో కవులు కిన్నెర కింపురష గంధర్వాది దేవ జాతుల్లా కనిపిస్తారు. అప్పుడు వాళ్ళకు సమాజం ఇచ్చే గౌరవం పువ్వులకు గాలులు కూడా ఇవ్వలేవు. వాళ్ళు ఏమి చేసినా చెల్లుతుంది. "సుకవితా యద్యస్తి రాజ్యేన కిం" అంటే సుకవిత చేతులో ఉన్నవాడికి రాజ్యంతో పనేమిటి అన్న ప్రాచీన సూక్తి తాత్పర్యం ఈ నాటి తెలుగువారు బహుశా ఊహించను కూడా లేరు.

జిగర్ మురాదాబాదీ అంటాడు—

**హాయ్ ఓ సబ్జా చమన్ కెజినె**

వాహ్ ఎలాంటి తోట అది!

**సాయామె గుల్ మె నీంద్**

**ఆయీ హై**

దానికి ఒక గులాబీ నీడలో నిద్ర వచ్చింది!

అహ్మద్ ఫరాజ్ విఖ్యాత పాకిస్తానీ కవి షేర్ ఒకటి:-

**అబ్కె బిఛ్ దే తొ హం షాయెద్**

**కభీ ఖాబో మే మిలే**

ఇప్పుడు మనం విడిపోయామంటే బహుశా ఎప్పుడన్నా కలల్లో కలుస్తామేమో

**జిస్తర్హా సూఖే హుఁవే ఫూల్**

**కితాబోఁ మేమిలే**

ఎలా, ఎండిపోయిన పూలు పుస్తకాల్లో కలుస్తాయో....

ఉర్దూ కవి కొన్ని శతాబ్దాల నుంచీ ఒక జీవన దృక్పథాన్ని సృష్టించాడు. అది ఉర్దూ ప్రజల ఆలోచనల్ని ఒక నాజూకు దనంతో శిల్పించింది.

**బహారోంకా చమన్ యాదా**

**గయా హై**

వసంత రుతువులకు తోట జ్ఞాపకం వచ్చింది!

**ముఝే ఓ గుల్బదన్ యాదా**

**గయా హై**

నాకు ఆ పుష్పశరీర జ్ఞాపకంవచ్చింది!-అని ఒక పాకిస్తానీ కవి షేరు. గజల్ అనే ఒక మోహ పాశంతో ఉర్దూ కవి ప్రజల్ని బంధించి తనవైపు లాక్కున్నాడు. మాట

# అనామకుడి డైరీ

నెత్తికి గాయం తగిలి వైద్యం కోసం వెళ్ళాడాయన. తల మీద దెబ్బ ఎలా తగిలిందో చెప్పుకొచ్చాడట:

"యిది యిరవయి ఏళ్ళ కిందట జరిగిన సంగతండి. పని మీద పట్నం వెళ్ళి హోటల్లో దిగాను. రాత్రి పన్నెండు గంటలకి తలుపు చప్పుడయింది. తలుపు తీస్తే ఎదురుగా ఒక చక్కని చుక్క.

"నా గదిలో మంచినీళ్ళయి పోయాయండీ:మీ గదిలో ఏమన్నా వున్నాయా?" అంది.

మంచి నీళ్ళిచ్చి, తలుపు వేసుకుని, పడుకోబోయేంతలో మళ్ళీ చప్పుడు. మళ్ళీ ఆమే!

"ఏమండీ, నా గదిలో చాలా చలిగా వుందండీ. గదిలో రగ్గుగినా ఏమయినా వుందేమోననీ" అని నసిగింది.

## అనాడీ

రగ్గు ఇచ్చి, తలుపు వేసుకుని, నిద్రలో పడబోతుంటే మళ్ళీ అదే చప్పుడు.

తలుపు తీసి, "ఇంకా ఏం కావాలి?" అన్నాను.

"అబ్బ, ఎంత ప్రయత్నం చేసినా, నిద్ర రావడం లేదండీ! మీ దగ్గర నిద్ర మాత్రలు ఏమన్నా ఉన్నాయేమోననీ" అని దీర్ఘం తీసింది.

ఇవాళ పాత ఫొటోలు తగిలించడానికి, గోడకి మేకులు కొడుతూంటె, ఆ సంగతి జ్ఞాపకం వచ్చింది, ఆ పిల్ల ఎందుకు అన్ని సార్లు తలుపు తట్టిందో అర్థమయి,నా తెలివి తక్కువతనానికి నెత్తికొట్టుకుంటే, చేతిలో సుత్తి తగిలి తల కాస్త చిల్లుపడింది. అంతేనండి" అన్నాడట!

"సమఝ్నేవాలే సమఝ్గయీ,
నా సమఝ్ ఓ అనాడీ హై"

అంది నూతన్ రాజ్‌కపూర్ సినిమాలో.

* * * * *

1940 ప్రాంతంలో ఒంగోలులో వుండేవాళ్ళం. యింటి వారమ్మాయి శకుంతల మా క్లాసే. బొద్దుగా, పచ్చగా, చలాకీగా వుండేది. నా నోట్సులూ, పుస్తకాలూ అవీ పట్టుకుపోతూండేది.

స్కూల్లో హాజరు పట్టీలో ముందరగా ఆడపిల్లల పేర్లు, తరవాత మొగపిల్లలవీను. నేను స్కూలు టరం మధ్యలో చేరడంవల్లా, యీలోగా ఒక అమ్మాయి మధ్యలో వెళ్ళిపోవడంవల్లా, ఆ అమ్మాయిస్థానే నా పేరు రాసుకున్నారు.నాపేరుముందు ఆడపిల్లలే—వెనకా ఆడపిల్లలే.

మా స్కూల్లో నంబరుప్రకారం పిల్లలు కూచోవాలి. మగవాళ్ళందరిలోకీ నాపేరే ముందు కాబట్టి నేనే ముందు సీట్లో కూచోవాలని నా వాదం. నా పేరు ఆడపిల్లల మధ్య వుంది గాబట్టి, వాళ్ళ మధ్యలో కూచోవాలనీ మగపిల్లలమధ్య కూచునే అర్హత లేదనీ మొగపిల్లల వాదం. రోజూ యీ విషయంమీద చర్చలేచేది.



బహుశ ఆ రోజుల్లోనే నాలో వున్న నాయకత్వపు లక్షణాలు బయటకు వస్తున్నాయనుకుంటాను. సాయంత్రం అయేటప్పటికి మా యింటికి "విన్నర్" "విన్నర్" అనుకుంటూ ఫుట్‌బాలు ఆటగాళ్ళు వచ్చేసేవాళ్ళు.

వాళ్ళు ఆడే ఫుట్‌బాలు నాదే. వాళ్ళు తాగే సోడాలు, తినే వేరుశెనక్కాయలు వగైరా అన్నిటికీ ఖర్చు నాదే.

అంతమంది బిల బిల్లాడుతూ మా యింటికి రావడం చాలా గొప్పగావుండేది.

"పదండ్రా పోదాం" అంటే మంచి నీళ్ళనో, మరొటనో, అక్కడ్నించి కదిలే వాళ్ళు గారు. తాత్సారం చేసేవాళ్ళు.

అందుకు కారణం మా యింటి వారమ్మాయి శకుంతలేనని తెలియడానికి తరవాత చాలా ఏళ్ళు పట్టింది!

— వేమురాజు నరసింహారావు